స్కెచ్

# సత్యశోధన

దివ్యప్రభాకర్

జరిగిన సమావేశాన్ని నెమరువేసుకుంటూ ఇంటి వేపు నడక సాగించాను. ఆనందరావు ఉపన్యాసం మిత్రులందర్నీ ఆనందపరచింది. అందుకు కారణం మిత్రుల్లో ఎవరెవరికి ఎవరెవరు అభిమానులో పసిగట్టిన ఆనందరావు తన ఉపన్యాసంలో వాళ్ళందర్నీ చుక్కల్లోకి ఎత్తేశాడు. కాని అదృష్టవశాత్తూ ఒకరి అభిమానానికీ, ఇంకొకరి ఆగ్రహానికీ గురి అయిన కవులూ, నాయకులూ యెవరూ లేరు— అది ఆనందరావు ఆనందానికి మూలం.

అసలు ఈ ఆదివారపు సమావేశమంతా సూర్యం పురాతన భావావేశాన్ని ఖండించడంతోనే సరిపోయింది. మొదట్లో తనవాదాన్ని నిలబెట్టుకునేందుకు సూర్యం ప్రయత్నం చేసినా, ఊపిరి సల్పకుండా ఆధునికత్వమూ, ముందడుగూ, నాగరికతలను ముఖ్యాంశాలుగా తీసుకుని అరగంట ఏకధాటిగా ఆనందరావు మాట్లాడటం మిత్రులు చప్పట్లు కొట్టడంతో అతను నీరసించాడు. ఉడుక్కునిలేచి చక్కాబోయాడు. అనుక్షణం అభివృద్ధిపొందే ఆధునిక విజ్ఞానం శాస్త్రీయపరిశోధనా సత్ఫలితాలూ ఆనందరావు మీద బాగాపనిచేస్తున్నాయి. కొంతకాలంనుంచి సూర్యం పురాతనతత్వాలూ వాటి ఉన్నతీ చర్చకు తెచ్చేసరికి ఆనందరావు అగ్గి అయ్యాడు. "నీ పుట్టుక పదిహేనో శతాబ్దంలో అయితే బాగుండేది!" అని గొప్ప చమత్కరించాడు. ఆనందరావు వెంటనే "అబ్బే, పదకొండో శతాబ్దం అయితే ఇంకా బాగుండేది!" అన్నాడు.

ఉదయం ఎనిమిదిగంటలకు ఆరంభమైన ఆనందరావుగారింట్లో ఆదివారపు సమావేశం సూర్యం వాకౌట్ చెయ్యటంవల్లా, గడియారం పన్నెండు కొట్టడంవల్లా అప్పటికి ముగిసింది.

నేను ఇంటిగుమ్మం ఎక్కుతుండగా వెనుకనుంచి ఆనందరావు పిలుపు వినిపించింది. వెనక్కితిరిగి చూశాను. అతను లేటు అయిన బస్సులా పరుగెత్తుతున్నట్లు నడుస్తూ, చెమటలో మునిగి తేలుతూ వస్తున్నాడు. ఆశ్చర్యంగా రెండడుగులు అతనివేపు వేసి కలుసుకున్నాను. "ఏమిటీ?" "లోపలికిపద చెపుతా..." అన్నాడు పూడిపోయిన గొంతుతో.

ఇద్దరం ఇంట్లోకొచ్చి కూర్చున్నాం. ఆనందరావు "చూడూ, ఇవ్వాళ లేచి ఎవడిముఖం చూశానో, నిష్కారణంగా వందరూపాయలు పోయాయి...ఏమిటీ చెయ్యడం?" అన్నాడు.

నేను ఆలోచన్లో పడ్డాను. వందరూపాయలు యెలా పోయాయా అని కాదు నా ఆలోచన! ఈ ఆధునికవాది ప్రొద్దున్నే యెవరి ముఖం అని తాతయ్యలా మాట్లాడుతుంటే ఆలోచన అష్టదిక్కులకూ పోతుంది. సరే, ఇవన్నీ తీరిగ్గా చర్చించవచ్చునని పారిపోతున్న మనస్సుని జుట్టుపట్టుకుని స్థిమితంగా కూర్చోపెట్టి కర్తవ్యచింతన ప్రారంభించాను. "పోనీ పోలీసులకు రిపోర్టు యిస్తే..."అన్నాను.

"ఊహుఁ, లాభం శూన్యం"అన్నాడు ఆనందరావు. అసలు వందరూపాయలు ఎలాపోయాయో వర్ణించి డిటెక్టివ్‌కి చెప్పినట్టు చెపుతున్నాడతను. పావుగంట ఆలోచించినా ఏ ఉపాయమూ తోచలేదు. చిన్నప్పుడు "ఆహారము మెదడు పనిచేయుటకు కావలసిన శక్తినిచ్చును"అని ఆహారంవల్ల ఉపయోగాలు వల్లెవేసిన ముఖ్యవిషయం గుర్తుకొచ్చింది. కడుపులో దహించుకుపోతోంది. ముందు ఈ క్షుత్తుని ఉపశమింపజేస్తేగాని బుర్ర పనిచెయ్యదనడం సత్యం.

"రెండునిముషాల్లో వస్తా"నని అతనితో చెప్పి వంటింట్లో జొరబడ్డాను. "అన్నం తినకుండా మంతనాలేమిటి?"అని మందలించింది నా పాలిగృహిణి. సంగతిచెప్పాను. గుడ్లు మిటకరించి "వందే!"అంది. "పోనీ ఆ ప్రశ్న చెప్పే ఆయన

దగ్గరకు వెళ్ళండి. మొన్న వెంకమ్మగారి గేదె పోతేనూ..."అంటోంది అది.

"మంచిదానవే! అటువంటివంటే అతనికి మంట"అని తిండి పూర్తిచేసి ఆనందరావుదగ్గర కొచ్చాను. అతను "రా చెప్తా, సైకిళ్లు అద్దెకుతీసుకుని...పదత్వరగా"అని వాకిట్లో వెడుతున్నాడు. అర్థంకాక, అర్థంచేసుకునేందుకు అనుసరించాను.

అద్దెసైకిళ్లు తీసుకున్నాము. పాతిక అరటిపళ్లూ అణా అగరువత్తులూ, ఒక కొబ్బరికాయూ కొన్నాడు ఆనందరావు. వాహనాలు ఆరోహించి ఎటో పోతున్నాం.

"ఎక్కడికి?"అన్నాను.

"ప్రశ్నకి"అన్నాడు ఆధునిక భావావేశాగ్రేసరుడు.

ఆనందరావుకి తోడుగా వెడుతున్న ఈ స్నేహితుడు సైకిలుమీదే మూర్ఛపడి లేచి, ఆవేశంగా తొక్కుతున్నాడు.

"ప్రశ్న చెప్పే ఆయన తీసినమనిషి పోలికలు కూడా చెపుతాడట!"అన్నాడు ఆనందరావు.

ఆపళంగా మీదపడి పీక్కలిందామనిపించింది కాని సభ్యతా, జైళ్లూ జ్ఞాపకం వచ్చి "ఊఁ" అన్నాను గాంధీగారికున్నంత సహనంతో.

నాలో ఓ ప్రపంచయుద్ధమూ, ఓభూకంపమూ ఆరంభమైంది. బహుశా యీ అంతర్ప్రళయాల తాలూకు విషమఫలితాలు పైకికూడా వ్యాపించవచ్చు. అప్పుడిహ జరిగేది ఊహించలేనిది!

"ఈ సైన్సుయుగంలో బూజుపట్టిన మెదళ్లు గల నీబోటివాళ్ళు ఉండటం చాలా అనర్థం... నాకొక్కడికీ శక్యంకాదుగానీ, లేకపోతే ఈశాఖవాళ్ళందర్నీ ప్రపంచంలోంచి నిష్క్రమించే ప్రయత్నాలు చేద్దును" అని ఆనందరావు నిష్కర్షగా అన్నమాటలు సుత్తిదెబ్బల్లా విజృంభించాయి నా చుట్టూను.

పశ్చాత్తాపానికీ, పరివర్తనకీ తగిన కాలం అవసరం. మానవుడిలో ఈ రెండు అమాంతం జరగటం అసంభవమనేది సత్యదూరంకాదేమో, కాని ఏదో అనూహ్య ఘోరసంఘటనవల్ల కూడా అప్పుడప్పుడూ ఈ మార్పులు జరగటంకద్దు. కాని చాలా అరుదు. ఆనందరావులో కలిగిన యీ మార్పుకి చాలాకాలం తీసుకు తీరాలి అనేది ఖాయం—ఎందుచేతనంటే అతని తత్వం అలాంటిది గనుక. ఒక్కసారిగా యిలా రంగు ఫిరాయించటంలో కలిగే అనర్థాలు అతనికంటే ఇతరులకే ఎక్కువ. ఆ విషయం రాజకీయ నాయకులకు బాగా తెలుసు. అందుకే తాము రంగు ఫిరాయించటంవల్ల తమకేమంత చెప్పుకోదగ్గ కష్టనష్టాలూ, క్లిష్టపరిస్థితులూ కలగకపోవటం వాళ్లుగుర్తించే ఉన్నారు. కాని ఒకమామూలు, సాధారణవ్యక్తి, కో-క్లర్క్ ఇలా చేశాడంటే మనస్సు బాధపడటంనుంచి విరమించుకోలేకపోయింది. ఈ విషయం అతన్ని ఇప్పుడే అడగటమా, అడక్కపోవడమా అనేది ముఖ్యవిషయం కాదు. కానీ దానికి వచ్చేసమాధానం ప్రస్తుత సందర్భాన్నిబట్టి మనకేమాత్రం తృప్తికరంగా, ప్రీతికరంగా ఉండదనేది నిస్సందేహం. ఇది తెలిసే మిన్నకుండటం ఉత్తమంగా గుర్తించి మనస్సుని ఒకవిషయాన్నే ఆలోచించాలిఅనే కట్టుదిట్టాన్నుంచి విడుదలచేసి స్వేచ్ఛనిచ్చాను. అదికూడా నాకు ద్రోహంచేసి, దానిస్వాతంత్ర్యాన్ని దుర్వినియోగం చేసుకోలేదు.

చిర్రుబుర్రులాడుతూ, నిప్పులు చెరుగుతున్న సూర్యభగవానుణ్ణి మేఘమాలికలు అడ్డుతగిలాయి. చెమట్లుకారుతున్న దేహానికి పడగాలి తగిలినా చల్లగా హాయిగాఉంది. మేఘాల నీడలు భూమిమీద పొడలు పొడలుగా పరుగెత్తుతున్నాయి. పొలాల్ని వెనక్కినెట్టుకుంటూ వీలయినంత వేగంగానూ వాహనాల్ని తొక్కుతున్నాం. గమ్యాన్ని సమీపిస్తున్నకొద్దీ నిన్నటి సూర్యం మాటలూ, మా అమ్మమ్మచెప్పే ఆవిడ చిన్నతనం నాటి గొప్పవ్యక్తుల మహత్కార్యాలూ, అక్కడక్కడా వెలుస్తున్న యోగీశ్వరులూ మనస్సులో మెదలసాగారు. ప్రొద్దు కొద్దిగా వాటారేవేళకు ఆశ్రమంలాంటి ఓ ప్రదేశాన్ని చేరుకున్నాం.

పూజాద్రవ్యాలు సమర్పించుకుని వినమ్రులమై నిలబడ్డాం యిద్దరమూ. "సంగతి సవిస్తరంగా సెలవిచ్చుకోండి" అన్నాడు ప్రక్కనే ఉన్న శిష్య పరమాణువు. నాకు కొద్దిగా నవ్వొచ్చింది. కాని శాపభయంవల్ల ఒక గుటకలో మింగేశాను. స్వాములవారి మహాత్మ్యము ఎలా ఉన్నా ఈ

శిష్య పరమాణువులుమాత్రం నిజంగా పరమాణువు అంతపనీ చేస్తారనటంలో అతిశయోక్తిలేదు.

"అయినవాడు ఆప్తుడు, ఆదరించేవాడు విద్యావంతుడు, విజ్ఞాని, విశ్వసాక్షీనాముడు వీలు చూసి పట్టుకెళ్ళాడు. ఇక్కడకు దక్షిణంగానూ, ఊరికి ఉత్తరంగానూ ప్రస్తుతం ఉద్యాల్యల లూగుతోంది సొత్తు, వ్యక్తిమధ్యరకంగా ఉంటాడు. శక్తి ప్రసక్తి అనవశ్యం. త్వరగా వెళ్ళితే మొత్తం దొరుకుతుంది. లేకపోతే చిల్లరఅయి జనబాహుళ్యానికి దక్కిపోతుంది" అన్నారు ఆయన.

ఆనందరావు నావంక చూశాడు. ఇప్పుడేకాదు చూడ్డం, 'విశ్వసాక్షీనాముడు' అని ఆయనచెప్పే సరికే నావంక తిరిగేడు. నా గుండెలు కొద్ది వేగాన్ని హెచ్చించాయి. ఎవరీ విశ్వసాక్షీ నాముడు? ఈ విశ్వసాక్షీనాములు వేలమంది. ప్రతిదేవతా విశ్వసాక్షి, కాని ఆనందరావు నా ముఖంలోకి చూడటంలో గల ఆంతర్యం కొద్దిగా బోధపడసాగింది. విశ్వసాక్షి సూర్యుడు కావటంలో సందేహం లేకపోవచ్చు. అతని పర్యాయ పదాలు అసంఖ్యాకాలు...కాని ఆనందరావు ఆప్తుల్లో ఆ పేరుగలవారెందరున్నారో నాకు తెలీదు...కాని నా పేరుమాత్రం సూర్యుడికి పర్యాయపదమే!...హరహరా! ఎంతటి ముప్పు గొని తెచ్చుకొంటిని' అని నాలోపల ఎవరో ఘోష పెడుతున్నారు.

"అసలు నా సొమ్ము నా యిల్లుదాటి ఎంత సేపయింది స్వామీ?" అన్నాడు ఆనందరావు లేచి నిలబడుతూ, ఆయన ఒక్కక్షణం కళ్లు మూసుకున్నారు నేను చిన్నప్పుడు నా క్లాసు పుస్తకంలోని గయోపాఖ్యానం నాటకం వేస్తున్నప్పుడు కృష్ణుడి వేషంవేసి అలాగే కళ్లు మూసుకునేవాణ్ణి గయుడు ఉమ్మేసేందుకు—

ఆయన కళ్లుతెరిచి "దాదాపు రెండుగంటల పైనా నాలుగుగంటలలోపూ అయింది. ఇక మీరు నిష్క్రమించవచ్చును" అన్నారు.

మౌనంగా వాకిట్లోకొచ్చి మళ్ళీ సైకిళ్లెక్కి స్వగృహోన్ముఖులమయ్యాం. ఈసారి ప్రయాణం నాకు చాలా కంటకంగా ఉంది. ఏదో చెప్పలేని ఆవేదన ప్రారంభమైంది. నేను ఇంటికి వెళ్ళి జరిగిందంతా మా ఆవిడకి చెప్పేసట్టూ, అది 'అక్షింతలు వేసుకోకుండా వినాయక చవితి నాడు చంద్రుణ్ణి చూడవద్దంటే సింగినాదం అని అన్నందుకు ఊరికే పోతుందా' అని అన్నట్టూ, ఆనందరావు పోలీసుల్ని తీసుకొచ్చి 'వీడే నా వందరూపాయలు దొంగిలించిది' అని నన్ను చూపించగా వాళ్ళు నన్ను జైల్లో పారేసినట్టూ..ఏవిటో ఇంకాఇంకా ఆలోచన్లూ దృశ్యాలూ నాకు ప్రదక్షిణాలు చెయ్యసాగాయి. అన్నిటికీ మిన్నగా మిత్రుడిమౌనం నన్ను చీల్చేస్తోంది. ఇంక కొద్దికాలం భయంకర మౌనాన్ని భరించవలసివస్తే నాగుండె పగిలి ఆనందరావు ఊహాసి భగ్నంచేసి ఉండును- కాని ఇంతలో అతనే నాకు ఆయువు పోస్తున్నట్లు మాట్లాడాడు- "చూడు మిత్రమా! విన్నావుగా అతను చెప్పినది, నీ ఉద్దేశ్యం ఏవిటి?"అన్నాడు.

ఆనందరావు స్థితిలో నేనేఉండి యీ ప్రశ్న వేసినట్లయితే అతను "నాకిలాంటివి అసలు నమ్మకం లేదుఫో" అనేవాడు. సరిగ్గా ఈ సమాధానమే ఇప్పుడు నేనుచెప్పలేని అసమర్థతకి కారణం అతని ఆప్తుల్లో 'విశ్వసాక్షి'ని నేను కావటమే! నేనేమీ మాట్లాడకుండా నోరుచప్పరించాను- అందులో భావాన్ని ఎలా అర్థంచేసుకున్నా ఇబ్బందిలేనివిధంగా.

"అదికాదు...నా మిత్రుడికి వందరూపాయలు అవసరమే అనుకో, నన్ను అడగొచ్చునుగా, దొంగతనంగా తీసుకెళ్ళవలసిన అవస్థ ఎందుకు పడాలి?" అన్నాడు మళ్ళీ. అతను మిత్రుడుఅని ప్రయోగించినది ఎవరిని ఉద్దేశించోనని ఆలోచిస్తున్నా. ఆనందరావు సూటిగా అడగరాదూ, డొంకతిరుగుడుగా ఎందుకుపోవాలి?"

"అసలు నీ కెవరిమీదా అనుమానం?" అన్నాను అప్పటికన్నా బయట పెడతాడేమోనని.

"ఎవరిమీదైతేమాత్రం ఏవిటి ప్రయోజనం! నేనేమీ శ్రమతీసుకుని ఆ స్నేహితుణ్ణి అవమానించదలుచుకోలేను. పోనీ పోతేపోయింది... కాని ఎన్నాళ్లో కూడబెట్టి మామయ్యబాకీతీర్చాలి, పాపం ఆయన పెళ్ళికూతురు చీరెలకని ఇచ్చి పోయాడు. అయినా నా స్నేహితుల్లో ఇటువంటి వారుంటారని ఎలా ఊహిస్తాను? నాకోనమ్మకం

కూడా ఉంది. తీసుకెళ్ళిన స్నేహితుడు ఎంతో అవస్థలో ఉండి ఉంటాడు" అని నావంక అదో రకంగా చూశాడు.

అటువంటి అనూహ్యమైన ప్రశ్న విని తెల్ల ముఖం వేసే వీక్‌నెస్ నాలో లేదనేందుకు నమ్మకమేముంది? అందుకనే నేను తల హ్యాండిల్‌బార్ వంక త్రిప్పి "అవస్థలేకపోయినా వందరూపాయలు చేదా, మనలాంటి యన్. జి. ఓలు ఎంతకాలం కష్టపడి నిలవచెయ్యగలమొత్తం అది!" అన్నాను.

ఆనంరావు నావంక చూసి మెల్లిగా నవ్వాడు. నవ్వి "ఆ స్వామి చెప్పింది ఎలా ఉంది?...దాన్ని బట్టి ఎవరని నీ అనుమానం?" అన్నాడు.

"చెప్పలేను" అన్నాను ముక్తసరిగా.

"ఒకవేళ నన్ను విడిపించటానికి తీసి ఉంటాడంటావా?" అన్నాడు.

"ఇలా ప్రచారం చేసినప్పటికీ తీసిన వాళ్లు ఎగిరి ఇస్తారనే ఆశ నాకు లేదు" అన్నాను.

"అంత కాన్ఫిడెన్సుగా చెప్పటానికి నీకేం ఆధారం వుందీ?" అని నా కళ్ళల్లోకి చూశాడు.

ఊరికి దగ్గర్లో కొచ్చాము. ఊళ్లో లైట్లు అప్పుడే వెలిగాయి. వాటిని చూస్తే ఎందుకో హృదయం రెపరెపలాడింది. భారంగా, మెల్లిగా తొక్కుతున్నాను సైకిలు. నేను మందగించటం వల్ల అయిదారు గజాలు ముందు కెళ్ళిన ఆనంద రావు బ్రేకులువేసి మళ్ళీ ఒదిలి "మిత్రమా! భయ పడకు, వెనక్కి తగ్గుతున్నావేం? పోలీసులకి పట్టిస్తాననేనా?" అన్నాడు.

నేను "ఆఁ! ఏమిటి?" అన్నాడు కాస్త ఆదుర్దాగానే. అతను నవ్వుతూ నన్ను కలుసుకుని ఎగతాళిగా అన్నట్టు "అవసరమైతే నన్ను అడక్కపోయావ్?...దొంగతనం చెయ్యవచ్చా? తప్పుకాదూ?" అన్నాడు.

"ఏమిటి? ఏమిటి నువ్వనేది? నా కర్థం కాలేదు...అంటే...నేను...వంద..." ఆనంద రావు మధ్యలోనే అందుకుని "ఆ! వంద సంగతే, దొంగతనం ఎందుకు చేశావూ అంటున్నా!" అన్నాడు రెట్టిస్తూ. నేను స్తంభించిపోయాను. సైకిలు తొక్కటం ఆగిపోయింది. అనుకున్నంతా అయింది' అని లోపల ఘోష! వెధవ ఘోష! అయితే అలా నవ్వుతాడెందుకూ?

"క్షమించు ఆనందరావ్! నువ్వు పొరపడు తున్నావ్" అన్నాను. "పొరపాటేం లేదు. అను కున్నది నిజమైంది. అంతే! మనం ముందు అను కున్నది వీసం వార లేకుండా జరిగితే యెంత ఆనందంగా ఉంటుందో తెలీదూ?" అన్నాడు సైకిలు దిగి చేత్తో పట్టుకుని నడుస్తూ.

"కావచ్చు! కానీ... నేను..." అంటున్నాను ఏం చెబుదామనో నా వుద్దేశ్యం! నేను తియ్య లేదు అనేగా! ఒకవేళ అలా అంటే నమ్మినవాడు ఎలా నమ్ముతాడనో నా నమ్మకం!

"మిస్టర్! ఖంగారుపడకు. అనుకున్న పని అయింది. ఆదివారం హాయిగా ఎంజాయ్ చేశాం. పైగా ఆ సూర్యం ఉన్నాడు చూశావూ, వాడి లాంటి వాళ్ళని జుట్టు పట్టుకుని ఊపేందుకు ఓ తార్కాణం. ఎక్సలెంట్ ఎక్స్‌పెరిమెంటు!... ఏం భయపడకు...మన జీవితంలో వంద రూపా యలు చూస్తామనే నమ్మకం లేదు. అలాంటిది మన స్వంతం వంద రూపాయలుకాక, ఇతరులవి పోయాయంటే వెంటనే హార్ట్ ఫెయిల్ అనుకో. పద...పద" అన్నాడు ఆనందరావు. చెమటలు దిగజారుతూంటే ఎయిర్ కండిషన్ హోటల్లో దూరాం.

